# భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారి
# 78వ జన్మదిన దివ్యసందేశము

సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువసున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
దాన ధర్మాల సార్థకత సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
పదవులనేలిన ఫలముసున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
బహుళ సత్కార్యలాభంబు సున్న
ఈ సనాతన ధర్మహర్మ్యంబు నిలుప
గుణము లియ్యవి నాల్గు పునాది గోడలప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా!

ప్రేమస్వరూపులారా!

మానవజీవితము నాలుగు గుణములపై ఆధారపడి యున్నది. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ ఈ నాలుగు గుణములే జీవిత సౌధమునకు చక్కని భద్రమైన పునాదులు. ప్రాచీనకాలము నుండి భారతీయ సంస్కృతి ఈ నాల్గు గుణములపైనే ఆధారపడి నడుస్తున్నది. ప్రతివ్యక్తియొక్క తల్లిదండ్రులుగాని, తాత ముత్తాతలుగానీ అనాదికాలమునుండి ఈ నాల్గు గుణములే ఆధారముచేసుకొని బ్రతుకుతూ వచ్చారు. ఈ నాలుగు గుణములే లేకుండిన జీవితసౌధము క్షణములో కూలిపోతుంది. ఈనాడుకూడను మానవులు కొంతవరకు సత్య ధర్మ శాంతి ప్రేమలపైన ఆధారపడి జీవించటంచేతనే ఇంతమాత్రమైనా ప్రశాంతముగా జీవించ గలుగుతున్నారు. వ్యక్తులయొక్క జీవితము తల్లిదండ్రులయొక్క గుణములపైనే ఆధారపడియున్నదో. జిజియాబాయి ఇట్టి గుణములపై ఆధారపడి శివాజీని పోషిస్తూ వచ్చింది. రాముడు దేవుడు కావటానికి కౌలస్యయొక్క గుణములే ఆధారము. కవల కుశలవులు ఇంతటి వీరులు కావటానికి వారి తల్లి సీతాదేవియొక్క గుణప్రభావమే ఆధారము. అయితే, ఈనాడు కొందరు తల్లిదండ్రులను అలక్ష్యముగా చూస్తున్నారు. వారి గుణములకు, ప్రభావములకు కించిత్తైనా విలువనివ్వటం లేదు. పుతలీబాయియొక్క గుణములచేతనే గాంధీ మహాత్ముడుగా మారిపోయాడు. ఈ పుతలీబాయి ప్రతిరోజూ కోయిలకూత వినకుండా ఏమీ భుజించేది గాదు. తల్లి భుజించక, కుమారుడు భుజించటము సాధ్యము కాకపోయింది.

ఒకరోజు మధ్యాహ్నం 12 గంటలైంది, ఒంటి గంట అయింది, మూడు గంటలైంది. కానీ, తల్లి భోజనానికి సిద్ధముకాలేదు. అప్పుడు గాంధీ ఒక యుక్తి పన్నాడు. ఇంటి వెనుకకుపోయి కోయిలమాదిరి తాను కూత కూస్తూవచ్చాడు. తిరిగిలోపలకు వచ్చి “అమ్మా కోయిల కూసింది, నీవు వినలేదా? ఇంక భోజనం చేద్దాం పద,” అన్నాడు. అప్పుడు ఆ తల్లి చాలా బాధపడింది. “ఇలాంటి దుర్మార్గుడైన కుమారుడు నా గర్భమునందు పుట్టాడా! కేవలం పొట్టకూటి నిమిత్తమై నన్ను అబద్ధముచేత వంచిస్తున్నాడా! నోటితో

తాను కోయిలకూతవలె కూస్తూ కోయిలకూసినదని అబద్ధములాడుతున్నాడు," అని కోపముతో కుమారుని చెవిపట్టి ఈడ్చింది. "దుర్మార్గుడా! పొట్టకూటినిమిత్తమై నీవు అబద్ధములాడుతున్నావా?" అని రెండుదెబ్బలు చెంపమీద కొట్టింది. అప్పుడు గాంధీ చాలా పశ్చాత్తాపపడి "నా తప్పును క్షమించమని" ప్రార్థించాడు. అప్పుడు తల్లి 'నిన్ను క్షమించుటకు వీలుకాదు. అసత్యమాడినందుకు శిక్ష అనుభవించే తీరాలి' అని ఖండించింది. ఆనాటినుండియే గాంధీ జీవితాంతము వరకు తాను అసత్య మాడకూడదని ప్రతిజ్ఞ చేసుకున్నాడు. ఈవిధముగా ప్రాచీన కాలమునుండి భారతదేశములో గొప్పగొప్ప వ్యక్తులందరు తల్లియొక్క గుణగణములు, శిక్షణల ప్రభావము చేతనే ఉత్తములైన వ్యక్తులుగా పెరుగుతూ వచ్చారు. ఈనాడు భారతదేశములో ఇంతటి అసత్యప్రభావము పెరిగిపోవటానికి కారణమేమిటి? కుమారులు ఆడేటటువంటి ఆటలు, పాడేటటువంటి పాటలు, చెప్పేటటువంటి మాటలలో అసత్యము చేరిపోవటం చేతనే దేశము ఇంత దుర్గతికి వచ్చింది. దేశముయొక్క మంచిచెడ్డలకు తల్లిదండ్రులయొక్క శిక్షణే మూలకారణము. కనుక, తల్లిదండ్రులు సత్యమార్గమునందు ప్రవేశించినప్పుడే బిడ్డలుకూడా సత్యమార్గమందు ప్రవర్తిస్తారు.

ప్రతి పౌర్ణమినాడు భారతదేశంలో స్త్రీలు సత్యన్నారాయణవ్రతమును ఆచరించుట ప్రాచీన కాలమునుండి సాంప్రదాయముగా వస్తున్న పద్ధతి. అదేవిధముగా ఈ శరీరమునకు తల్లియైన ఈశ్వరాంబకూడా ప్రతిపౌర్ణమికి సత్యనారాయణపూజ చేస్తూ ప్రక్కింటి సుబ్బమ్మతోచేరి యీ సత్యన్నారాయణ వ్రతకథను వింటూ వచ్చేది. అప్పుడు సుబ్బమ్మ ఒకరోజు చెప్పింది. "ఈశ్వరమ్మా! నీవు సత్యన్నారాయణ వ్రతంలో పాల్గొంటున్నావు కాబట్టి నీకు పుట్టే కుమారునికి సత్యన్నారాయణుడని నామకరణం చేయమ"ని చెప్పింది. ఒకనాడు మధ్యాహ్నం ఒంటి గంట అయినప్పటికిని ఈశ్వరమ్మ భోజనము చేయలేదు. ఇంటిలో అందరూ ఈ సత్యన్నారాయణ పూజనిమిత్తమై ఇన్ని నిబంధనలా? అని విసుగుచెందారు. ఆమె భర్త వెంకమరాజుకూడా ఆమె పట్టుదలను ఖండించాడు. అప్పుడు ఈశ్వరమ్మ "మీకు ఆకలైతే భుజించండి, నాకు ఆకలిగాలేదు సత్యన్నారాయణ ప్రసాదము తీసుకున్న తర్వాతే భోజనం" అని పట్టుపట్టింది. ఈశ్వరమ్మ ఆనాడు తాను స్వయంగా సత్యన్నారాయణ వ్రతము చేయనప్పటికీ ప్రక్కింటి కరణం సుబ్బమ్మ సత్యన్నారాయణ వ్రతముచేసి ప్రసాదము తెచ్చి ఈశ్వరమ్మకు అందించింది. ఆ ప్రసాదము భుజించి తాను ఆనందంగా గడుపుతూ వచ్చింది. ఆవిధంగా సత్యన్నారాయణవ్రత ప్రసాదము భుజించిన తరువాత ఆమెకు గర్భము నిల్చింది. "యద్భావం తద్భవతి." మానవుని స్థితిగతులన్నీ తమతమ సంకల్పములయొక్క ప్రభావముపైనే ఆధారపడి ఉంటాయి.

దీనిని కొందరు అంగీకరింతురు. కొంత మంది విస్మరింతురు. కానీ, యీమె ఈ ప్రమాణమును ఏమాత్రము విస్మరించలేదు. పట్టుపట్టి ఆ ప్రసాదమును భుజించి తన కార్యక్రమమునకు పూనుకొనేది. ఆమె ఒక అక్షరముకూడా చదువుకోలేదు. చదువు యేమాత్రము లేదు. అయినప్పటికీ ఆమెకు భగవంతునిపై అచంచలమైన భక్తి, విశ్వాసములు ఉండేవి. సుబ్బమ్మ యిచ్చిన సత్యనారాయణవ్రత ప్రసాదము భుజించిన తరువాత, ఏడవనెలలోపల ఆమె యింటికి వచ్చి 'ఈమారు నాకు గర్భము నిల్చింది' అంది. అందువలన, 'పుట్టబోయే కుమారునికి సత్యన్నారాయణ అనిపేరు పెట్టుకుంటా'నని వాగ్దానము చేసింది. అప్పుడు వెంకమరాజు తల్లి (తానుకూడా స్త్రీయే కదా!)కూడా అందుకు అంగీకరించింది. ఈవిధంగా ఇంటిలో అందరూ గాఢమైన విశ్వాసంచేత పుట్టబోయే కుమారునికి 'సత్యన్నారాయణ' అని పేరుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ ప్రసవమునకు పూర్వము ఒక సంఘటన జరిగింది. ఈ పుట్టపర్తి ఆనాడు చాలా చిన్నపల్లె. ఈశ్వరమ్మ ఇంటికి, నాలిగిండ్లమధ్యలోపల ఒక చేదబావి ఉండేది. ఆ చేదబావియందు నీరు

చేదుకొని తీసుకునిపోతున్నాది ఈశ్వరమ్మ. అప్పుడు ఏదో తెల్లనిరంగులో పొగమంచులాంటి గాలి వీచింది. ఇది చూచి తన ఇంటియందున్న సుబ్బమ్మ కూడా బయటకు వచ్చి "ఏమిటో ఆకాశమునుండి ఒక వెలుతురు ఈశ్వరమ్మ గర్భములో ప్రవేశించినట్లుగా నాకు కనిపించింది" అని చెప్పింది. ఈవిషయాన్ని ఈనాటివరకు నేను ఎవరికి చెప్పలేదు. అందరు తెలుసుకొనే నిమిత్తమై ఈనాడు నేను వెల్లడిచేస్తున్నాను. ఈ సంఘటన జరిగిన ముందురోజు సాయంకాలము వెంకమరాజు సుబ్బమ్మగారి యింటి ముందునుండి నడుస్తూ వస్తున్నాడు. అప్పుడు సుబ్బమ్మ ఆయనను లోపలికి పిలిచి, "వెంకమరాజూ! రేపు రాత్రి మీకు పుట్టబోయే కుమారునికి 'సత్యనారాయణ' అని పేరు పెట్టు" అని చెప్పింది. కానీ, ఆయన "ఇదంతా స్త్రీల మూర్ఖపు పట్టుదల" అని గేలి చేశాడు. సరే! మరునాడు తెల్లవారుజామున 3 గంటల సుముహూర్తమునందు కుమారుడు పుట్టాడు. పుట్టిన తక్షణమే ఏడ్వడము ప్రతి పిల్లవాని లక్షణము. కానీ ఈ పిల్లవాడు ఏ మాత్రము ఏడ్వలేదు. అదిచూచి చుట్టూవున్న ఆడవారు "ఈ పిల్లవాడు ప్రాణములేనట్లు పుట్టాడని కంగారు పడ్డారు" వీరందరి మాటలువిన్న ఈశ్వరమ్మకు కూడా భయం ఏర్పడింది. ఎవరికీ చెప్పకుండా బిడ్డను గట్టిగా గిల్లింది, ప్రాణముంటే ఏడుస్తాడు కదాయని. ఏడ్పుకు బదులు ఆ పిల్లవాడు నవ్వాడు. పురిటిబిడ్డ ఇంకా గంటకూడా కాలేదు. ఆ సమయంలో నవ్వటమనేది ఎంత ఆశ్చర్యము! తక్షణమే కరణం సుబ్బమ్మగారు వారింటికి వచ్చి "అమ్మా! సుమూర్తము లోపల నీకుమారుడు పుట్టినట్లు విన్నాను. చూడాలని వచ్చాను" అంది. ఆమె బ్రాహ్మణ స్త్రీ కాబట్టి పరిటి స్త్రీని తాకదు. అందువలన ఈశ్వరమ్మ బిడ్డను ఒక బట్టపైఉంచి దూరంగా పెట్టింది బిడ్డను చూడమని. ఆనాడు బ్రాహ్మణ స్త్రీలకు గొప్ప మడి, ఆచారము ఉండేవి. పురిటి బిడ్డను తాకితే స్నానం చేయటం వారికి అలవాటు. ఇంతలో ఈశ్వరమ్మ అత్తగారు అక్కడకు వచ్చి "ఏమి ఈశ్వరమ్మా! కుమారుని చూడాలని ఆమె వస్తే బిడ్డను ఆమెకు ఎంతో దూరములో పెడుతున్నావే, ఆమెకు అందించు" అన్నది. దానికి ఈశ్వరమ్మ "అత్తా! సుబ్బమ్మయొక్క పట్టుదల చాలా గొప్పది. ప్రాచీన ఋషులకు సైతం ఆదర్శంగా నిరూపించింది సుబ్బమ్మ. మన బిడ్డలనంతా ఆమె ముట్టేది కాదు" అని చెప్పింది.

ఈ పిల్లవాడు దినదినమునకు పెరుగుతూ వచ్చాడు. కానీ, పిల్లవానిపద్ధతి కొంచెము వింతగా ఉండేది. ఎవ్వరితోనూ మాట్లాడేవాడుకాదు. మితభాషి, మితమైనతిండి, ఈవిధంగా కాలం గడుపుతూ వచ్చేటప్పటికి తల్లి ఈశ్వరమ్మ చాలా విచిత్రపడుతూ వచ్చింది. సాధారణంగా పుట్టిన ప్రతిపిల్లవాడు తిండికి వెంపర్లాడుతూ ఉంటాడు. ఈ పిల్లవాడు చేపలు, మాంసము వంటి పదార్థములను దగ్గరకుకూడా రానిచ్చేవాడు కాదు. ఎవరింట్లోనైనా ఇలాంటి మాలిన్యమైన పదార్థములు చేస్తే వారింటికికూడా పోయేవాడుకాదు. ఈశ్వరప్రసాదము వల్లకలిగినవాడు కనుక ఈవిధమైన పదార్థములు ఇష్టపడడని గుర్తించింది ఈశ్వరమ్మ. ఈశ్వరమ్మకు తాళం వేస్తూ వచ్చింది, పెద్ద బిడ్డ వెంకమ్మ. ఈశ్వరమ్మ, వెంకమ్మ పిల్లవాణ్ణి దగ్గరకు చేర్చి నిరంతరము దైవసంబంధమైన పాటలు పాడుతూ ఉండేవారు. ఇలాంటి అభ్యాసముతో ఈ బిడ్డ పెరుగుతూ వచ్చాడు. ఇంతలో ఈ పల్లెలో చదువు ఏమాత్రము ఉండదని అన్న శేషమరాజు ఉరవకొండకు అతణ్ణి తీసుకొనిపోయాడు. శేషమరాజు యొక్క స్నేహితుడు రామరాజు సెలవులలో పిల్లవానిని బళ్ళారి దగ్గరనున్న హంపీక్షేత్రమునకు తీసుకొనిపోయి దైవదర్శనం చేయించాలని విరూపాక్షదేవాలయానికి తీసుకువెళ్ళాడు. అప్పుడు విరూపాక్షదేవాలయములో అభిషేకము జరుగుతున్నది. అభిషేకసమయములో విరూపాక్షుని రూపం ఎవరికీ కనిపించలేదు. ఆ గర్భగుడిలో ఈ పిల్లవాడు తిరుగుతున్నట్లు కనిపించాడు. అదిచూచిన శేషమరాజుకు కోపం వచ్చింది. "దేవాలయ గర్భగుడిలో భగవంతుని స్థానములో ఈవిధంగా ఈ పిల్లవాడు కనిపించటం

పద్ధతికాదు కదా! కనుక, బయటకు పంపించాలని భావించాడు. సత్యమే కనిపిస్తున్నాడు. ఇది ఆశ్చర్యమా, నా భ్రమా అని ఆలోచించి భార్యను సామాను దగ్గర ఉండే సత్యంకు కాపలా పెట్టాడు.

ఇంతలో రామరాజు ఆపిల్లవానిని చూచాడు. ఆపిల్లవాడి తలచుట్టూ జ్యోతి వెలుగుతున్నట్లు ఒక దివ్యకాంతిమండలం అతని కంటికి కనిపించింది. అయితే, ఇతను ఎవరితోనూ చెప్పలేదు. అసలు శేషమరాజుకు మొదటినుండి ఇవన్నీ అంటే చాలా అనుమానాలు. ఈవిషయాన్ని శేషమరాజుకు ఏమాత్రము చెప్పకూడదని రామరాజు, అతని భార్యా తమలో తాము మాట్లాడుకున్నారు. సెలవులు అయిన తర్వాత ఈ పిల్లవానికి గుడ్డలు కుట్టించాలని రామరాజు సంకల్పించుకున్నాడు. ఒక నిక్కరు, షర్టు తీసుకొని వచ్చాడు. నేను వాటిని అంగీకరించలేదు. ఇవన్నీవద్దని అవన్నీ ఆ పొట్లంకట్టి వారింటిలోపలే పెట్టాను. ఆనాడు పిల్లలందరికీ కాలరు పిన్ను అంటే ఇష్టము. శ్రీమంతుల బిడ్డలకు బట్టలు కుట్టించి, దానికి బంగారు కాలరు పిన్ను వేసేవారు. నేను బట్టలు తీసుకోలేదని, ఈ రామరాజు నేను ఉరవకొండకు వస్తుంటే నాషర్టుకు ఒక బంగారు కాలరుపిన్ను వేశాడు. అప్పుడు నావయస్సు 10 సంవత్సరములు నిండుతున్నది. ఆనాడు ఇంటికి వచ్చి పుస్తకాలు తీసుకొని స్కూలుకు వెడుతున్నాను. ఉన్నట్టుండి కాలరు పిన్ను జారిపడిపోయింది. తక్షణమే అక్కడనే పుస్తకాలు పారవేసి యింటికి వచ్చి

నేనుసాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాసె మీకు నా తోటి సంబంధమింక
కాదు నన్పట్ట మరి ఎటువంటి ఘనునకైన

అని ఒక పద్యము చెప్పాను. శేషమరాజు కవి. ఆయన "ఎవరో చెప్పించారు, వీడి ముఖానికి ఇంత కవిత్వం వస్తుందా!" అని హాస్యము చేశాడు. శేషమరాజు భార్య," నీవు, ఇంటికి వెళ్ళకుండా ఎక్కడికీ పోకూడద"ని చెప్పింది. ఈ దేహముపైన చాలా అభిమానము కలిగిన ఎక్సైజు కమీషనర్ హనుమంతరావు అని ఒకాయన ఉండేవాడు. అతని పిల్లలకు కూడా స్వామి అంటే చాలా అభిమానము. ఈవిధంగా స్కూలుకు పోలేదని తెలిసి ఆయన కారు వేసుకొనివచ్చి అందులో కూర్చోపెట్టుకొని తనఇంటికి తీసుకువెళ్ళి ఎంతగానో గుచ్చిగుచ్చి అడిగాడు. "బాబూ! నీకెందుకు కలిగింది ఈ వైరాగ్యము – ఇంట్లో వదినా, అన్న ఎవరైనా తిట్టారా? ఏమిటి కారణమ"ని అడిగారు. అక్కడకూడా కవిత్వం చెప్పాడు.

ప్రాపంచిక సంబంధము పిన్నె తొలగెన్
దైవదర్శనము కూడ చెల్లెను హంపిన్

ప్రాపంచిక సంబంధము ఒక చిన్న పిన్ను వంటిది. కాబట్టి ఆ పిన్నును తొలగించుకున్నాను. మాయతొలగెనని గృహము బాయగదొడగెన్ అని చెప్పి "నేను ఇక ఇంటిలో ఉండను అని బయలుదేరిపోతుంటే ఆ ఎక్సైజ్ కమీషనర్ తన కారులో ఇంటికి తీసుకువెళ్ళాడు. అక్కడ కూడా ఎవరింటికి నేను పోలేదు. హనుమంతరావు ఇంటిలోకూడా నేను ప్రవేశించలేదు. వారింటి ముందు ఒక రాయి (గుండు) ఉండేది. ఆ గుండుపైన కూర్చున్నాను. దానిపై కూర్చొని ఎవ్వరితో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాను. "ఏమిటి? ఈ పిల్లవానిలో ఈవిధమైనమార్పు కలిగింది" అని అందరూ ఆశ్చర్యపడుతూ వచ్చారు. సాయంకాలము స్కూలునుండి శేషమరాజు ఇంటికి వచ్చాడు. ఇంటికి వస్తూవస్తూ తనవెంట తమ్ముని తీసుకువెళ్ళాలని ఎంతగానో ప్రయత్నంచేశాడు. నేను "రాను, రాను" అని ఖచ్చితంగా చెప్పాను. అప్పుడు హనుమంతరావు శేషమరాజుతో "నాయనా! ఇప్పట్లో ఆ పిల్లవానిని ఏమీ హింసచేయకండి, ఇక్కడే ఉండనీయండి శాంతపడిన తరువాత నేనేతీసుకొని వస్తాను" అన్నాడు. ఆనాటినుండి ఆగుండును నేను

వదలలేదు. ఎవరెవరో వచ్చి "ఎవరునీవు? దయ్యంపట్టిందా? పిశాచం పట్టిందా? ఎవరు నీవని" అనేక ప్రశ్నలు వేస్తూ వచ్చారు. "నేను భూతముకాదు, పిశాచముకాదు, నేను సాయిని తెలియుము నిక్కముగను" అని నేను వారికి స్పష్టంగా చెప్పాను. "నీవు సాయిబాబా" అని మాకుఎట్లా తెలుస్తుంది అని వారు ప్రశ్నించారు . అప్పట్లో సాయిబాబా అనేపేరు ఆప్రాంతాలలో ఎవ్వరూ వినలేదు. ఎవ్వరికీ తెలియదు. అనంతపురం జిల్లాలో సాయిబాబా పేరేఎవరికీ తెలియదు. అప్పుడు ఎవరో పూలు తీసుకొని వచ్చారు. ఆ పూలు నేను చేతిలోకి తీసుకొని చల్లాను. ఆపూలు "సాయిబాబా" అనే అక్షరాలుగా ప్రోగు పడ్డాయి. ఆ పూలు ఒకదానివెంట ఒకటి "సాయిబాబా" అని అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఆ గుండు నేటికి కూడా ఉరవకొండలో ఉన్నది. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ గ్రామంలో ఆంజనేయులు అని ఒకాయన ఉన్నాడు. ఆయన ఆంధ్రప్రదేశ్ సత్యసాయి సంస్థలకు స్టేట్ ప్రెసిడెంటు. ఆయన ఆగుండుపైన గొప్ప మందిరము, హాలు కట్టించాడు. అతడు ఒక ఫోటో తీసాడు. నాముందు ఆ గుండు ఉంది. గుండుపైన సాయిబాబా ఉన్నాడు. అది ఫోటోలో స్పష్టంగా వచ్చింది. ఆ ఫోటోలు అందరికీ పంచారు. నా ఖ్యాతి దినదినాభివృద్ధి అవుతూ రావటంచేత చుట్టుప్రక్కల పల్లెలవారు, పట్టణాలవారు దయ్యాలు, భూతాలు పట్టినవారు అనేకమంది బండ్లుకట్టుకొని వచ్చేవారు. "ఈ పిల్లవాడు పొమ్మంటే పోతాయి దయ్యాలు" అని అనేక మంది పిచ్చివాళ్ళను కూడా తీసుకువచ్చారు. ఈవిధంగా వారి నమ్మకమునకు తగినట్లు పిశాచములు వారిని వదలిపోయినాయి. అప్పుడు అది సత్యమని అనేకమంది నమ్మినారు. ఈవిధంగా ఈ సత్యము యొక్క ప్రభావము దినదినమునకు పెరుగుతూ వచ్చింది. ఇంక శేషమరాజు నన్ను తనదగ్గర పెట్టుకోవటం సాధ్యంకాదని తండ్రికి జాబువ్రాశాడు. ఆరోజుల్లో జాబులు ఒకచోటునుండి మరోచోటుకు పోవటం చాలా కష్టంగా ఉండేది.

పెద్దవెంకమరాజు ఒక సోమవారమురోజున సంతకని బుక్కపట్టణం వెళ్ళాడు. అక్కడ అతనికి శేషమరాజు పంపిన జాబు అందింది. ఆ జాబులో 'నీవు క్షణమైనా అక్కడ నిల్చటానికి వీలులేదు. వీనిని పట్టుకోవటం మాకు చేతకాదు. తక్షణమే వచ్చి ఇంటికి తీసుకొని వెళ్ళవలసింది' అని వ్రాశాడు. ఆయన సంతనుంచి అట్లానే వచ్చాడు పాపం. జేబులో నయాపైసాలేదు. శేషమరాజునుండి బస్సుఛార్జీ యిప్పించుకొని ఉరవకొండనుండి బస్సులో కూర్చోబెట్టుకొని వచ్చాడు. బుక్కపట్టణం వరకు వస్తుంది బస్సు. అక్కడనుండి పుట్టపర్తి నడచుకొని రావాలి. పెద్దవెంకమరాజు నా చేయిపట్టుకొని కష్టపడి నడిపించుకొని తీసుకువచ్చాడు. ఇంటిదగ్గర కొండమరాజుఉంటున్నాడు. కొండమరాజుకు చాలా చాదస్తము. దేవుడన్నా, దేవతలన్నా చాలానమ్మకము అతనికి. ఆయన పెద్ద వెంకమరాజును పిల్చి "వెంకప్పా! వీనిని ఏమీ అనకు. వీని ధోరణి దైవచింతనకు సంబంధించినది. వీనిని కొన్నిదినములు నాదగ్గర పెట్టుకుంటాను" అన్నాడు. ఆయన దగ్గర పెట్టుకొని ఉదయము, సాయంకాలము క్షణక్షణము చూచుకుంటూ వచ్చేవాడు. ఈలోగా ఈ ఉమ్మడికుటుంబములో అన్నదమ్ములకు కొంత వ్యత్యాసము ప్రారంభించింది. పెద్దవెంకమరాజు, చిన్నవెంకమరాజు, వెంకట్రామరాజు, సుబ్బరాజు అని నలుగురు అన్నదమ్ములు. వారు నలుగురు వేరు పోవాలని కూర్చున్నారు. సరే! ఒక్కొక్కరికి ఒక్కొక్కరూము ఇచ్చి పొమ్మని చెప్పాడు కొండమరాజు – కొండమరాజు ఒక్కడు మాత్రమే ఒంటరిగా నిల్చాడు. 'నాన్నా! మీరు ఏక్కడుంటారని పెద్దవెంకమరాజు వచ్చి అడిగాడు. ' నాయనా! నాకు ఎవరూ అక్కరలేదు. సత్యాన్ని నా వెంట పంపించు. నేను సత్యము ఇద్దరము ఉంటాము' అన్నాడు. కుటుంబములో ఎప్పుడూ ఎవరూ 'సత్యన్నారాయణ' అని పూర్తిపేరు పెట్టి పిలిచేవారు కాదు. అందరు 'సత్యం, సత్యం' అని పిలిచేవారు. ఆయన నన్ను తీసుకొనిపోయి తన దగ్గరే పెట్టుకున్నాడు. నేను ఆయన సేవలంతా చేస్తూ వచ్చాను. ఈవిధంగా ఉంటుండగా కొన్ని దినములకు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పొద్దున్న, సాయంకాలము వెంకమ్మ మాత్రము వచ్చేది. 'సత్యా! నీకేమైనా కలలు వస్తుంటాయా? నీకెవరైనా కనిపిస్తుంటారా?' అని విచారించేది. నేను మాత్రం ఎవరికీ ఏమీ చెప్పేవాడను కాను. ఆమెకు కూడా సాయిబాబా అంటే చాలా నమ్మకం. అప్పుడు 'సాయిబాబా

ఫోటోనాకు కావాలి సత్యం' అని ఆమె కోరింది. నేను సాయిబాబా ఫోటో ఒకటి నా చేతితో సృష్టించి యిచ్చాను. ఈ సాయిబాబా చేతిలో ఏది చిక్కుతుందో ఎవరికీ తెలియదు. ఆ పటమును వెంకమ్మ చనిపోయేవరకు తన దగ్గరనే పెట్టుకుంది. కుటుంబములో కొండమరాజు ఒక్కడే నా దివ్యత్వాన్ని గుర్తించాడు. అందువలననే గృహము అమ్మాయి పేరును ఈశ్వరమ్మగా (అంటే ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ) మార్చమని పెద్దవెంకమరాజుకు సూచించాడు. అసలు ఈశ్వరమ్మకు తల్లిదండ్రులు పెట్టినపేరు నామగిరమ్మ. ఒకరోజు కొండమరాజు మెత్తగా వెంకమ్మను పిలిచాడు. 'వెంకమ్మా! మనవాళ్ళందరూ అజ్ఞానులుగా అమాయకులుగా జీవితము గడిపేస్తున్నారు. సత్యముయొక్క శక్తిని ఎవరూ గుర్తించడానికి ప్రయత్నించడంలేదు. ఇతడు కేవలం దైవాంశ సంభూతుడుగా కనిపిస్తున్నాడు. ఆకలి అని చెప్పడు. నిద్ర అని చెప్పడు. ఆకలిదప్పులు లేకుండా నిద్రాహారములు లేకుండా గడుపుతూ వస్తున్నాడు' అని చెప్పాడు. నేను రాత్రి పండుకుంటే కొండమరాజు లేచి నాదగ్గరకువచ్చి ముక్కు దగ్గర వేలుపెట్టి చూచేవాడు. శ్వాస వస్తుందా, లేదా? అని చూచేవాడు. సోహం, సోహం అనేది కనిపిస్తున్నది, గాలి కనిపించటంలేదే! వీని శరీరమునకు జబ్బు ఏమైనా ఉందేమో! అయినా ఈ పరీక్షలకు నేనెందుకు పోవాల'నుకున్నాడు. కొద్దిరోజులలోనే కొండమరాజు ఇంటికి జనం గుంపులుగుంపులు బయలుదేరి రావటం మొదలు పెట్టారు. 'ఎందుకు మీరు కొండమరాజు ఇంటికి పోతున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే 'ఆ కొండమరాజు ఇంట్లో ఆయన మనుమడు ఉన్నాడుట! దైవశక్తిగా కనిపిస్తున్నాడట! మాకందరికి కలలో వచ్చాడు. మాకందరికి కలలో చెప్పాడు' అని చెప్పేవారు. ఇంతలో సెలవలకు శేషమరాజు పుట్టపర్తి వచ్చాడు. ఈ విధంగా సత్యంను దైవాంశసంభూతుడుగా గుర్తించి జనం తండోపతండాలుగా రావటం చూచి కొండమరాజుతో పోట్లాడి 'మన యింటికి ఎవరూ రాకుండా చూసుకో' అన్నాడు. ఆనాటి పరిస్థితిలో చదువుకున్నవారంటే గొప్పగా గౌరవించేవారు. శేషమరాజు అంటే గొప్ప చదువరి అని భావించుకుంటూ వచ్చారు పల్లె ప్రజలు. ఆయన వచ్చి కొండమరాజుతో," తాతా! ఈ అబ్బాయి దగ్గరకు ఎవరినీ చేరనివ్వకు. ఇదేదో పిచ్చిమాదిరి పోతున్నది' అని చెప్పి దీనికి హిస్టీరియా' అని ఒక పేరు పెట్టాడు. 'దైవశక్తికాదు ఏ శక్తికాదు' అని ఈవిధంగా హాస్యము చేస్తూ వచ్చాడు. ఈవిధంగా చేస్తూచేస్తూ వచ్చేటప్పటికి, దినదినానికి పెరుగుతూవచ్చింది ఈ మహాత్మ్యం. దానిని తెలుసుకున్న ప్రజలందరూ బండ్లు కట్టుకొని వచ్చేవారు. బయటబండ్లు నిలిచేవి. ఈ జనులను గమనించిన గ్రామస్థులు సత్యానికి దయ్యం పటిందని ఒకరికొకరు పోట్లాడుకోటం, కొట్టుకోటం చేసారు. కొందరు "పిచ్చి బాగా ముదిరిపోయింది, బాగుచేయటం ఇంక సాధ్యము కాద"న్నారు. 'కదిరిదగ్గర పిచ్చిని పోగొట్టేవాడు ఒకడున్నాడు. వాని దగ్గరకు తీసుకుపొండి' అని చెప్పారు. అప్పుడు బండికట్టి, బండిలో వెంకమ్మను, నన్ను కూర్చోబెట్టుకొని తీసుకొని వెళ్ళారు. వెంకమ్మ ఒక్క నిమిషంకూడా నన్ను వదిలేది కాదు. కదిరికి తీసుకువెళ్ళారు. అక్కడ వైద్యుడు ఒక పెద్ద త్రాగుబోతు. వాడు ఊరికే తాగి పడిపోతుంటాడు. "ఈ పిల్లవానికి పిచ్చిపట్టింది. నేను ఈ పిచ్చిని కుదురుస్తాను' అని చెప్పి నన్ను గట్టిగా కొట్టాడు. దేహమంతా గండ్లుపడ్డాయి. ఇంక ఏమాత్రముసాధ్యముకాదని విషంతెచ్చి కన్నులలో వేశాడు. కన్నుల మంటకైనా అంగీకరిస్తానేమోనని తాను చేశాడు. నేను సాయంకాలమే వెంకమ్మదగ్గరకు వచ్చి 'పేదరసము కంట్లో పోయమని' చెప్పాను. రెండవదినమే కన్నులు మామూలుగా తెల్లగా అయిపోయాయి. ఈవిధంగా ఎంతకఠినముగా హింసించినప్పటికి, పరిహారము ఆమెతోచెప్పి కుదుర్చుకుంటూ వచ్చాను. ఇంక సాధ్యంగాదని నా తల నున్నగా గొరిగించాడు. కత్తితో కోతలు కోశాడు. రక్తము కారుతున్నది. పుండు మాదిరి కనిపిస్తున్నది. ఇది చాలదన్నట్లు పది అడుగులు ఎత్తున ఒక పాత్రనుంచి దానిలో నీరు పోసి, క్రిందనన్ను కూర్చోపెట్టి ఆ నీరు నా గాయాలపై పడేటట్టు చేశాడు. ఆనీరు గుండుపైన పడుతుంటే మండేటటువంటిది. అప్పటికీ నేను ఓర్చుకున్నాను. ఇది సాధ్యముకాదని నిమ్మకాయలుకోసి తలపైన బాగారుద్దుతూ వచ్చాడు. ఇక ఈ బాధలు చూడలేకపోయింది వెంకమ్మ. రాత్రికిరాత్రి ఒకబండివానిని మాట్లాడుకొని నన్నుతీసుకొని తిరిగి పుట్టపర్తికి వచ్చేసింది. అప్పటినుండి ఈసాయి మహాత్మ్యము

దినదినప్రవర్థమానమౌతూ వచ్చింది. వందలాది భక్తులు ప్రతి దినము స్వామిని దర్శించుకోటానికి వస్తుంటే వారికి తగిన సదుపాయాలు చేయటం ఇంటిలోనివారికి వీలుకాలేదు. అప్పుడు పెద్ద వెంకమరాజు భక్తులను 'ఒక్క బేస్తవారము (గురువారము) మాత్రము రండి' అని చెప్పేటప్పటికి అందరికి చాలా భయం వేసింది. 'మా రోగాలు ఎక్కువై పోతున్నాయి. బేస్తవారం వరకు ఎట్లావుండేద'ని పోట్లాడుతూ వచ్చారు. అప్పుడు సుబ్బమ్మ వెంకమరాజును పిల్చి' వెంకప్పా! ఈ ఇంటిలో ఈదేవుని బిడ్డను పెట్టుకొని బ్రతుకలేవు. ఆ అబ్బాయిని మా ఇంటికి పంపించు. నేను అన్నివిధాలా చూచుకుంటాను' అంది. ఫలితంగా గ్రామములోని బ్రాహ్మణులందరూ ఈ సుబ్బమ్మపై ద్వేషము పూనారు. సుబ్బమ్మది బ్రాహ్మణకులం, ఈ సాయిబాబా యేమో క్షత్రియకులానికి చెందినవాడు. ఈయనను ఇంట్లో పెట్టుకొని అన్నివిధాలా చూసు కుంటున్నది. కనుక, ఈమె ఇంటికి ఎవరూ పోకూడదని నిర్ణయించుకున్నారు. అందుకు ఆమె 'నాకు బిడ్డలులేరు నా బిడ్డను మీరు తీసుకోండి, మీ బిడ్డను నాకివ్వండి అని నేను ఎవరిదగ్గరికి పోనక్కరలేదు. మీరేమైనా చేసుకోండి, ఈ సత్యాన్ని మాత్రం నేను వదలను' అని ఖండితంగా వారికి బదులు చెప్పింది. ఈవిధంగా జరుగుతుంటే పల్లెలలోపల మాల ఇళ్లు కొన్ని ఉన్నాయి. ఆ హరిజనులకు స్వామి అంటే చాలా ప్రీతి. హరిజనులంతా వారింటికి స్వామిని తీసుకొని పోతూవచ్చారు. ఆ సమయంలో 'ఈ అబ్బాయిని విడిచి నేను ఒక్కకూడా క్షణం ఉండను' అని సుబ్బమ్మ కూడా నాతో వచ్చింది. అప్పుడు సుబ్బమ్మకు 65 సం॥లు ఈ సాయిబాబాకు 11 సం॥లు. ఆమె స్వామిని బిడ్డమాదిరి చూచుకుంటూ వచ్చింది. దానితో ఊరంతా ఆమెపై ద్వేషము పూనారు. కట్టకడపటికి తల్లి, తమ్ముడుకూడా ద్వేషం పూనారు. కానీ సుబ్బమ్మ ఏమాత్రము చలించలేదు. దైవం యొక్క రీతికి ఇలాంటి ఆటంకములు వస్తూ ఉంటాయని సరిపెట్టుకుంది.' ఎన్ని ద్వేషాలైనా జరగనీ, నేను ఈ అబ్బాయిని మాత్రం వదలను. మీరు నన్ను ఏమైనా చేసుకోండి' అని ఆమె పట్టుదల పట్టింది. అనతికాలంలోనే ఆమె ఇల్లుకూడా పట్టనంతగా జనం వచ్చారు. అదిచూచి వెంకమరాజు సుబ్బమ్మ దగ్గరకు వచ్చి 'అమ్మా! మానుంచి మీకు ఈ అసౌకర్యములన్నీ ఎందుకు? సత్యంను వేరుగా ఒక యింటిలో ఉంచుదాం'అన్నాడు. అప్పుడు సుబ్బమ్మ వేణుగోపాలస్వామి గుడి ప్రక్కన కొంత భూమి ఇచ్చింది. అక్కడ స్వామికోసం ఒక చిన్న గది కట్టారు. అందుకు సుబ్బమ్మ సహాయము చేసింది. ఆగదిలో స్వామిని కూర్చోబెట్టి తలుపులు వేయటం మొదలు పెట్టారు. అలా తలుపులు వేసేటప్పటికి నేను ఎట్లాగో తప్పించుకొనిపోయి కొండపైకి కూర్చొనేవాడిని. 'తాళంచూస్తే వేసి ఉంటున్నాది. పిల్లవాడు బయటకు పోయాడు' అని అందరూ ఆశ్చర్యపోయేవారు. ఈవిధమైన అద్భుతాలు దినదినానికి జరుగుతూ వచ్చాయి. ఇంతలో ఒకనాడు 'బ్రాహ్మణ కులాన్ని నాశనముచేసి పెడుతున్నది ఈ సుబ్బమ్మ' అని, ఒకనాడు నాకు విషంపెట్టాలని ప్రయత్నంచేశారు. వడలంటే నాకు చాలా ఇష్టం. ఆ వడలు చేయించి, ఆ వడలలో కొంచెం విషం పెట్టి, నన్ను వారింటికి భోజనానికి పిల్చారు. సుబ్బమ్మ వారింటికి పోవద్దని చెప్పింది. కానీ నేను వెడతానని చెప్పివెళ్ళాను. వారింట్లో నేను విషమున్నవి మాత్రమే తిని విషము లేని వడలు వదలిపెట్టాను. ఈ సంగతి ఊర్లో అందరికీ తెలిసిపోయింది. ఇలా నాకు ఏవిధమైన అపకారము జరగలేదు. ఇంక వీలుకాదని, ఒకరు నేనుండే ఇంటికి నిప్పు పెట్టించారు. అది ఎలాంటి ఇల్లంటే గడ్డితో కప్పిన ఇల్లు. రాత్రి ఆ గడ్డికి నిప్పు పెట్టారు. బాగా మండుతున్నాది. ఈలోపల సాయిబాబా ఏమైనాడోనని చాలామంది భయపడుతూ పరుగెత్తి వచ్చారు. కొంతసేపటికి అక్కడ పెద్దవర్షము కురిసింది. అయితే, ఆశ్చర్యంగా ఆఇంటిపైన మాత్రమే వర్షము కురిసింది. మంటలు ఆరిపోయాయి.. ఈ విషయం తెలుసుకున్న వెంకమ్మ, సుబ్బమ్మ, ఈశ్వరమ్మ అందరూ ఏడ్చుకుంటూ వచ్చారు. 'ఏ దుర్మార్గులో, ఏ దుష్టులో ఈవిధంగా చేయరాని పనులు చేస్తున్నారు'అని బాధ పడ్డారు. ఇంటి పైకప్పు అంతా కాలిపోయి ఖాళీ అయిపోయింది. మొండి గోడలు కనిపిస్తున్నాయి. వాళ్ళంతా గోడపైకెక్కి చూచారు. నేను బాగా నిద్రపోతున్నాను. స్వామికి ఏమీ కాలేదన్న విషయం తెలుసుకొని వాళ్ళంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు ఇంటికి బీగము పగలగొట్టి సుబ్బమ్మ

నన్ను వారింటికి తీసుకుపోయింది. ఇలా అనేకరకములైన పరీక్షలు తట్టుకొని నిలబడిన తరువాత, నన్ను 'సాయిబాబా' అని నమ్ముతూ వచ్చారు. ఈవిధంగా జరుగుతూవచ్చేటప్పటికి పెనుగొండలో ఒకడు తాను సాయిబాబా భక్తుడనని బయలుదేరాడు. ఇంకా చాలామంది నేను సాయిబాబాను అని చాలా పేర్లు పెట్టుకొని తిరుగుతుంటారు. నా మాదిరే జుట్టు పెంచుకొని, గౌను వేసుకొని 'సాయిబాబా, సాయిబాబా' అని ఒకరు తిరుగుతూ వచ్చాడు. నేను అప్పుడు చెప్పాను 'పేరు పెట్టుకున్నంతమాత్రమున అది నెగ్గుతుందా? వారెవరో చేస్తున్న మోసాలే ఇదంతా మీరెవరూ ఎక్కడికీ పోనక్కరలేద'ని చెప్పాను. కట్టకడపటికి ప్రజలు సత్యమును తెలుసుకున్నారు. అప్పుడు కరణం సుబ్బమ్మ నాలుగుగోడలు కట్టి, ఒక చిన్న గది కట్టించి నన్ను అందులో ప్రవేశ పెట్టింది. అప్పటినుండి ఇంక బెంగుళూరువంటి దూరప్రదేశాలనుండి భక్తులు వచ్చి నన్ను వారితో తీసుకుపోవటం మొదలు పెట్టారు. ఇది చూచిన వెంకమ్మ, ఈశ్వరమ్మ నాతో" మీరు ఏమైనా చేయండి స్వామీ, కానీ ఎటువంటి పరిస్థితి లోనూ పుట్టపర్తిని మాత్రం వదలకండి' అని ప్రాధేయపడ్డారు. అప్పుడు నేను ' ఎట్టి పరిస్థితిలోనూ నేను పుట్టపర్తి వదలను. నేను ఇక్కడే ఉంటాను' అని వారికి వాగ్దానము చేశాను. క్రమంగా మైసూరు మహారాణి, ఇంకా కొందరు పెద్దలు కార్లువేసుకొని నన్ను చూడటానికి పుట్టపర్తి రావటం మొదలు పెట్టారు. అప్పట్లోచిత్రావతినది నిత్యం ప్రహించేటటువంటిది. వాళ్లు తమ కార్లను నదికి అవతల గట్టున నిలిపి, నదిని దాటివచ్చేవారు. ఈవిధంగా భక్తిప్రపత్తులు పెరుగుతూ పోయేటప్పటికి, వారిని ఆపటానికి ఎవ్వరూ ఏ అడ్డుచేయటానికి వీలు లేకుండా పోయింది. స్వామియొక్క కీర్తి దూరప్రాంతాలకు కూడా ప్రాకింది. ఇదంతా మాతృమూర్తియొక్క ప్రభావమే అనే సత్యాన్ని అందరూ గుర్తించారు. అదేవిధంగా ప్రతి మహనీయునియొక్క ఉన్నతికి కూడను తల్లులు ప్రోత్సహించి పవిత్రమైన మార్గాన్ని ప్రబోధించేవారు. కౌసల్య భగవంతుని ఎంతయో ప్రార్థించిన ఫలితంగా తనకు పుట్టిన రాముని ఎంతో మహనీయునిగా తయారు చేసింది. సీతామాత గర్భమున జన్మించిన కవలలు దైవాంశసంభూతులని జనులు పూజలు చేస్తూ వచ్చారు. ఇదేవిధంగా ఎంతోమంది తల్లులు తాము చాలా గొప్ప గుణవంతులుగా ఉండడంచేత తమ కుమారులకు ఎటువంటి ప్రమాదాలు జరుగ కుండా చూచుకుంటూ వచ్చారు. ఈశ్వరమ్మకు ఆనాడు ప్రమాణం చేయటం వలన నేను ఈనాటివరకు పుట్టపర్తిని వదలలేదు. ఎవరైనా ఇక్కడకు రావలసిందేకాని నేను ఎక్కడా స్థిరనివాసము చేసేది లేదు. కనుక, అవతార తత్త్వమంటే పుట్టిన స్థానమును వదలకూడదు. ఇక్కడ ఉన్న చెట్టును ఇంకొకచోట నాటితే కొంతకాలమునకు బ్రతకవచ్చును లేక మరణించవచ్చును.' సాయిబాబా' అనే ఈ మహావృక్షము ఎక్కడ పుట్టిందో అక్కడనే పెరగాలి. అలా ఈ పుట్టపర్తిని వదలకుండా నేను యిక్కడే ఉండటము వలన ఈ గ్రామం ఒక పెద్ద పుణ్యక్షేత్రముగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. బుక్కపట్నంలో హైస్కూలు కట్టినప్పుడు ఒక ప్రార్థన పద్యం వ్రాసి పెట్టమని నన్ను కోరారు.. నేను వ్రాసి ఇచ్చాను. పుట్టపర్తి వదలకుండా ఉండటానికి ఇదొక పద్యంగా పెట్టాను. అప్పుడే దీనిని విద్యార్థులంతా పాడుకుంటూ వచ్చారు.

అహరవ తవ ఆహ్వాన ప్రచారిత సునితవ ఉదారవాణి
హిందుబౌద్ధశిఖ్జైన పారశిక ముసల్మాన్ కిరస్తానీ
ప్రేమహార్ హయగాథా జనగణ ఐక్యవిధాయక
జయహే భారత భాగ్యవిధాతా!....

ఈ గ్రామానికి పుట్టపర్తి' అని పేరు రావటానికి వెనుక ఒక విచిత్రమైన చరిత్ర ఉంది.వేణు గోపాలస్వామి ఆలయంప్రక్కన గల పాతమందిరములో ఒక మూలన ఒక చిన్న పుట్ట ఉండేది. ఈ పుట్టలో ఒక పాము ఉండేది. ఈ గ్రామంలో ఉండే గొల్లలు ప్రతి దినము తమ గోవులను మేపుటకు ఊరి బయటకుతీసుకొని పోయేవారు. ఒక ఆవు మాత్రము తప్పించుకొని ఆ పుట్టదగ్గరికిపోయేది. ఆ ఆవు పొదుగులోని పాలను పాము త్రాగేది. ఖాళీ పొదుగుతో ఆవు యింటికి వచ్చేది. ఒకరోజున కొందరుగొల్లలు ఇది చూచి పుట్టదగ్గరికి పోయి ఆ పామును

చంపాలని ప్రయత్నంచేశారు. పాలు త్రాగుతుంటే ఆ పామును పెద్దరాయితో కొట్టారు. అప్పుడు ఆ పాము శాపమిచ్చింది. 'ఈ గ్రామములో గొల్లలు కానీ, గోవులుగానీ బ్రతకటానికి వీలుండదు' అని. అందువల్లనే పుట్టపర్తిలో ఉన్న గొల్లలు గ్రామాన్ని వదలి దూరముగా నున్న గోకులములో ఇల్లు కట్టుకున్నారు. దానిపేరే గోకులము. ఆనాడు ఆ పాముపై వేసిన రాయే ఇప్పుడు వేణుగోపాలస్వామి విగ్రహంగా ఆలయంలో పూజలందుకుంటున్నది. ఆనాడు గొల్లలు ఎవ్వరూ పుట్టపర్తిలో ఉండేవారు కాదు. సాయంకాలం అయ్యేటప్పటికి గోకులం వచ్చేసేవారు. పుట్టుపర్తిలో నిద్రచేసేవారు కాదు. ఈవిధముగా కొన్ని కొన్ని శాపములవల్లను, పాపములవల్లను యిలా జరుగుతూ వచ్చింది. ముఖ్యంగా ఈనాడు సాయిబాబా కీర్తి వ్యాప్తికావటానికి కారణము, పుట్టపర్తి అనే పేరు రావటానికి కారణం చెప్పాలని సంకల్పించి యిదంతా చెప్పాను. ఈ పుట్టపర్తికి యింత చరిత్ర ఉంది. ఇది కేవలం తమాషాకి పేరుపెట్టుకున్నది కాదు. ఇక్కడికి గొప్ప గొప్పవారందరూ వచ్చిపోయారు. చాలా మంది జమిందారులు వచ్చి నిల్చారు. పుట్టపర్తిలో నివసించి పుట్టపర్తి పేరు ప్రతిష్టలను కాపాడుతూ వచ్చారు. మైసూరు మహారాజావారుకూడా వచ్చారు. మహారాజా తల్లి మహా ఆచారవంతురాలు. ఆమె కర్నాటక పల్లి దగ్గర కారుదిగి పైన పట్టావేసుకొని ఎవరిపాదములు పెట్టనిచోట ఆమెపాదములు పెట్టుకుంటూ నడచి వచ్చేటువంటిది. ఆవిధంగా ఎంతోమంది గొప్పవారు, పుణ్యాత్ములు పుట్టపర్తిలో చేరారు. అనేకమంది పెద్దలచేత పూజింపబడి, పండింపబడి, గుర్తింపబడినది, ఈ పుట్టపర్తి.

శ్రీ పుట్టపర్తి నిలయుడు
కాపాడును నిన్ను నెపుడు కరుణాకరుడై
చేపట్టి నిన్ను బ్రోచును
ఏ పట్టున మరువకుండ ఏలున్ బాబా.

ఎవ్వరూ ఏనాటికీ ఈ చరిత్రను మార్చటానికి వీలుకాదు. పుట్టపర్తి చాలా ప్రఖ్యాతి పొందింది. తల్లులు పూజలు చేయటంచేత, తల్లుల ప్రార్థనలచేత, తల్లుల భక్తిప్రపత్తులచే మహనీయుల గుణములు పెరుగుతూవచ్చాయి. కనుక, తల్లిదండ్రులను మనము యేమాత్రము దూషించకూడదు. తల్లిదండ్రులను మనము ఏనాడూ హాస్యముగా పలకకూడదు. తల్లియొక్క మహత్తరమైన శక్తి ఆ హృదయములో ఉంటుంది. మాతృమూర్తిని గౌరవిస్తూరావాలి. వారికి చదువులు, సంధ్యలు ఉండనక్కరలేదు. అలాంటి చదువులులేని ఈశ్వరమ్మ ఈ పుట్టపర్తికి ఇన్నివిధములైన గొప్పతనము చేయించింది. అయితే, ఈనాడు కొందరు తమ పుట్టిన స్థానాన్ని వదలిపెడుతున్నారు. ఈశ్వరమ్మ పేరు మరచిపోతున్నారు, ఈశ్వరమ్మ కన్నకుమారుని గొప్పగా పొగడుతున్నారు. ఈశ్వరమ్మలేక ఈ గొప్ప శక్తి ఎక్కడనుండి వచ్చింది? కనుక, తల్లికీర్తిని ఎప్పుడూ కాపాడుతూ రావాలి. తల్లిని మనము ఏ మాత్రము కించపరచకూడదు. ఈవిధంగా జరుగుతూ వచ్చినది సత్యసాయియొక్క ప్రభావము.

ప్రేమస్వరూపులారా!

మీరు నిజంగా పుణ్యాత్ములు చాలా అదృష్టవంతులు స్వామితో ఆడటం, పాడటం, కూర్చోవటం అన్నీ మీరు గడుపుకుంటూ వచ్చారు. మీతో సాయి, సాయితో మీరు కనుకనే ఐ అండ్ యు ఆర్ వన్ అని చెబుతూ వచ్చాను.

మీరెప్పుడూ దైవముపైన విశ్వాసమును పోగొట్టుకోకూడదు. దైవము చాలా గొప్ప శక్తికల్గినవాడు. దైవము యొక్క శక్తిసామర్థ్యములు ఎవరూ వర్ణించుటకు వీలుకాదు. కనుక, మీరందరు దైవవిశ్వాసాన్ని పెంచుకోండి.

ఈ పుట్టపర్తి వచ్చి కళాశాలలో చేరినందుకు, విద్యను నేర్చుకున్నందుకు పుట్టపర్తి పేరు ప్రతిష్ఠలను మీరు కాపాడుతూ రావాలి. ఇక్కడ ఒక చిన్న విషయం మీకు చెబుతున్నాను. పిల్లలు చాలామంది వస్తున్నారు యిక్కడికి. వచ్చిన రెండవదినమే వెనుకకు పోవాలని పెంకితనము చేస్తుంటారు. కానీ, ఇక్కడికి చదువుకోటానికి వచ్చిన పిల్లలు సెలవలు ఇచ్చినా ఇంటికి పోవటంలేదు. ఏమిటి కారణం? అందరూ 'స్వామీ! మేము యిక్కడే ఉండాలి' అని

ప్రార్థిస్తూ యిక్కడే ఉండటానికి ప్రయత్నం చేస్తుంటారు. చాలామంది విద్యార్థులు తమ విద్య పూర్తి చేసుకొని , ఎం.బి.ఎ, ఎం.టెక్, ఎం.ఎస్సి, ఎం.ఎ, బి.యి.డి, యిలా అనేక కోర్సులు చేసి యిక్కడే ఉండిపోతున్నారు. పుట్టపర్తి విడిచి వెళ్ళరు. దీనికి కారణమేమిటి? సత్యసాయిబాబా ఒక పెద్దమాగ్నెట్ అన్నింటికంటె గొప్ప మేగ్నెట్ దైవమే. దైవము అన్నింటిని ఆకర్షించేవాడు. కనుక గాడ్ అన్ని విధాలా హృదయాన్ని ఆకర్షిస్తుంటాడు. అది ఎవరూ కనిపెట్టి చెప్పటానికి వీలుకాదు. ఈ మేగ్నెట్ ప్రభావము మున్ముందు చెప్పటానికి అవుతుంది.

........

మరొక్క ముఖ్య విషయం

ఆనాడు ఉరవకొండలో నేను మొట్టమొదటిసారి రాతిపైన కూర్చొని మానవాళికి ప్రబోధము చేసిన చోట మందిరము కట్టిన ఆయన (శ్రీవి. అంజనయ్యగారిని చూపిస్తూ) ఎం.ఎస్సి. ప్యాస్ చేసి, డాక్టరేట్ డిగ్రీ తీసుకున్నాడు. ఈయన తన ఉద్యోగము రిజైన్ చేసి ఆనాటినుండి స్వామి సేవలో ఉండిపోయాడు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీసత్యసాయి సేవాసంస్థలకు అధ్యక్షుడుగా సేవ చేస్తున్నాడు. (అంజనయ్యగార్ని చూపిస్తూ) అతని మామ ఇతను. ఇతనుకూడా అక్కడే ఉండేది. స్వామికోసమని నూరు ఎకరాలు స్థలం తీసి రకరకాల ఫలవృక్షములు పెంచి ఆ పండ్లన్నీ పుట్టపర్తి పంపించేవాడు. నూరుసంవత్సరములు నిండాయి ప్రస్తుతం యీయనకు. ఒక ముఖ్యవిషయం మీకు యిక్కడ చెప్పాలి. ప్రశాంతినిలయంలోనున్న ప్రతి ఒక్కరూ నూరు సంవత్సరాలు నిండనిదే వెళ్లిపోరు. కస్తూరి యిక్కడకు వచ్చాడు. ఆయన నూరేళ్ళు జీవించాడు. పూజారి కిష్టప్ప వచ్చాడు. ఆయనకూ నూరు పూర్తి నిండాయి. కామావధాని మీకు తెలుసు. వేదాన్ని వల్లించేవాడు. అతను వచ్చి 30 సంవత్సరములు తిరిగి వెనుకకు పోలేదు. ఇక్కడే ఉండిపోయాడు. ఒకదినము రాముని కళ్యాణము చేసి తన రూముకి పోతూ 'తిరిగి స్నానంచేసి వస్తాను స్వామీ!' అన్నాడు. 'నీవేమీ రానక్కరలేదు. స్నానంచేసి, భోజనం చేసి, చక్కగా పడుకో' అని చెప్పాను. వెళ్ళి స్నానము చేశాడు. స్వామి ఆజ్ఞ మీరకూడదని భుజించి పడుకున్నాడు. అట్లే వెళ్ళిపోయాడు. అతడు ఎప్పుడూ ఒకే నామాన్ని సాయినామాన్ని, స్మరించేవాడు. అతనికి ఎప్పుడూ ఏ రోగము లేదు. ఏనాడూ జ్వరముకూడా రాలేదు. సూరయ్య. అతను నిత్యబ్రహ్మచారి అతనికి ఏమీ అక్కరలేదు. వెంకటగిరి రాజావారి దగ్గర ఉండేవాడు. ఒకనాడు రాజావారితో, 'నేను పుట్టపర్తి పోతున్నాను' అన్నాడు. రాజావారు ఆతనికి అన్ని అనుకూలములు చేసి యిక్కడికి పంపించారు. ఇక్కడికి వచ్చి 30 సంవత్సరములు సేవచేసి నూరు సంవత్సరములప్పుడు పండుకున్నవాడు పండుకున్నట్లుగానే వెళ్ళాడు.

గోపాలరావు మీకు తెలుసు. అతనికి నూరు సంవత్సరములు నిండుతున్నాయి. ఆయన పరులకు సేవ చేయాలని క్యాంటీనుకి పోయి నీరు పోసేవాడు. ఆంధ్రాబ్యాంక్ ఛైర్మెన్‌గా ఉన్నప్పుడు బ్యాంక్‌లో స్ట్రైకు జరిగింది. పెద్దపెద్ద వారిని జైల్లో పెట్టారు. ఆ స్ట్రైకు సమయంలో ఇందిరాగాంధీ ఆయనకు టెలిగ్రాము పంపింది. నేను ఆనాడు వారింటికి భోజనానికి వెళ్ళాను. 'గోపాలరావూ! ఈ పోలిటిక్సులో నీవు చేరవద్దు. నీవు అనుసరించేది సత్యమార్గము. సత్యాన్ని వదలకుండా ఉండు' అని ఆయనకు చెప్పాను. అప్పటినుండి నా మాటపై నిలబడిపోయాడు. అతనిని ఎవరూ ఏమీ చేయలేకపోయారు. మన ప్రశాంతినిలయంలో ఆనందంగా నామస్మరణ చేసుకుంటూ కాలం గడుపుతున్నాడు. డెంటల్ డాక్టరు పద్మనాభన్ తండ్రి శేషగిరిరావు రిటైరై యిక్కడికి వచ్చి ఉన్నాడు. 63వ సంవత్సరములో వచ్చాడు. నూరు సంవత్సరములు నిండి ప్రశాంతముగా వెళ్ళిపోయాడు. వీరందరూ పరులచేత ఏమాత్రము సేవ చేయించుకోలేదు. ఆరకంగా ఎంతోమంది భక్తులు చిరంజీవులుగా నిల్చారు. ఏదిఏమైనా, దేహములు ఎప్పటికైనా పోక తప్పదు. అయితే, పరాధీనము కాకుండా పోవాలి.
(2003 నవంబరు 23వ తేదీ 80వ జన్మదిన సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)